

# కథ

**నియాజ్ అలి**

# తీపి గుర్తు

బొబ్బట్లు, పూర్ణాల కోసం శెనగపప్పు నానబో స్తుంటే వర్ధనమ్మకు భర్త సుందర రామయ్య గుర్తుకొచ్చాడు. రెండేసి శేర్ల పప్పు... ఆయనే ఉంటే ఇలా చెయ్యనిచ్చేవారా? ఇంత స్వతంత్రంగా ఇన్నేసి జంతికలు, అరిసెలు, పూతరేకులు, సున్నుండలు, బొబ్బట్లు, పూర్ణాలూ ఇంతింత మోతాదుల్లో ఇన్ని పిండివంటలు చెయ్యనిచ్చేవారా?

ఆలోచిస్తూనే ఆమె పెరటి వైపు వసారాలో అరిసెల పిండి దంచుతున్న పనివాళ్లు పిండి 'వాసెన' కట్టి సరిగ్గా జల్లించుతున్నారో లేదో చూడటానికెళ్లింది. వెనక వసారాలో ఓవైపు ఒకామె బెల్లం సన్నగా తరుగుతోంది. ఇద్దరాడవాళ్లు పెద్ద తిరగలిలో సున్నిపిండి విసురుతున్నారు. మరోవైపు కట్టెల పొయ్యిలో సన్నని మంట మీద గుండిగలో నెయ్యి కాగుతోంది. అంతా కలిపి, సున్నుండల తీపి వాసనతో ఇల్లంతా ఘుమఘుమలాడిపోతోంది. పెరట్లో దూరంగా మరో ఇద్దరు అరిశెల పిండి దంచుతున్నారు.

ఎన్నో ఏళ్ల తర్వాత వర్ధనమ్మ ఇద్దరు కొడుకులూ ఒకేసారి కుటుంబాలతో సహా వస్తున్నారు. వాళ్లొస్తున్న సందర్భంగానే ఈ సంబరమంతా.

పెద్దకొడుకు శశిధర్ డాక్టర్. భార్య అనుపమ కూడా డాక్టరే. కూతురు 'ఏలీ' (అంజలి)తో అమెరికా నుంచొస్తున్నారు. అన్నయ్య కుటుంబంతో వస్తున్నాడని ఆమె రెండో కొడుకు రవికాంత్ విజయవాడ నుంచి భార్య, ఇద్దరు పిల్లలతో వస్తున్నాడు. శశిధర్, అనుపమ ఇక ఈ ఊళ్లోనే ఉండి హాస్పిటల్ తెరుస్తారు. పేదవాళ్లకి ఇక పట్నం వెళ్లి వైద్యం చేయించుకోవలసిన బాధ తప్పుతుంది. రవికాంత్ విజయవాడలో ఇల్లు కొనుక్కుని భార్యాపిల్లలతో అక్కడే సెటిల్ అయ్యాడు. ఇన్నేళ్లకు ఇల్లు పిల్లాపాపలతో కళకళలాడబోతోంది. కూతుళ్లు లేని లోటు కోడళ్లతో తీరబోతోంది. ఇంతటి సంతోష సమయంలో భర్త ఉండుంటే అనిపిస్తోందామెకు.

ఉండుంటే ఏమయ్యేదో, ఎలా ఉండేదో...

* * *

వర్ధనమ్మ ఆ ఇంటి ఒక్కగానొక్క కోడలు. మామగారు ముందే లేరు. ఆమె అత్తగారు వర్ధనాన్ని చూసి, తెల్లటి ఛాయతో కళ గల చక్కటి ముఖంతో ఏ ఆర్భాటాలూ పెట్టుడు అలంకారాలూ లేని ముద్దరాలని ఒక్క చూపుతో గ్రహించేసి అప్పటికప్పుడే తాంబూలాలు పుచ్చేసుకున్నారు.

మెట్టినింటికొచ్చాక అత్తగారెంత పిసినారో తెలిసి బిక్కచచ్చిపోయింది వర్ధనం. పుట్టింటివారు మధ్యతరగతికి ఓ మెట్టు కిందే వున్నా, ఎప్పుడూ తిండికీ బట్టకూ ఇంతలా కరువొచ్చి వుండడం ఎరగదామె. అత్తగారు బియ్యం, పప్పు గీసి గీసి కొలిచి వండుతుంది. బియ్యం కడుగూ గంజీ ఓ కుండలో జాగ్రత్త చేసి వారానికి రెండుసార్లయినా 'లక్ష్మీచారు' చేస్తుంది. ఎవరన్నా వస్తూపోతూ "ఎందుకమ్మా, ఇంత వుండీ ఈ పిసినారితనం?" అనంటే "అలా జాగ్రత్తపడితేనే కదా ఇంత వెనకేయగలిగిందీ. తిండిదేముందీ, ఎంత తిన్నామో ఏమి తిన్నామో ఎవరన్నా చూడొచ్చారా?" అనేసేది తేలిగ్గా.

ఆమె తరం ముగిసింది. పెత్తనం కొడుకు చేతికొచ్చింది. బియ్యం, పప్పూ ఉప్పూ అన్నీ ఆయన చేతిమీంచి రావాల్సిందే. అన్నీ ఇచ్చాక తాళం పడుతుందా గదికి. భర్త, అత్తగారూ బతికినన్నాళ్లూ అర్ధాకలితోనే బతికిందామె. పాలేళ్లకూ పనిమనిషికీ ఎప్పుడూ స్వతంత్రంగా పట్టెడన్నం పెట్టేందుకు నోచుకోలేదామె.

ఒక్కడే కొడుకు. ఏ దురలవాటూ లేదు. ఏ బాధ్యతా లేదు. రెండెకరాల మాగాణి, నాలుగెకరాల కొబ్బరితోట, లంకంత కొంప... సగటు తల్లిదండ్రుల్లా కూతురు సుఖపడుతుందని అనుకున్నారు. అత్తగారి పిసినారి గుణం, ఆ తర్వాత అల్లుడి పీనాసితనం తెలిసినా అదేమీ పెద్ద అవగుణంలా తోచలేదు వారికి.

"సంపాదన, ఇంత ఆస్తి, సుఖశాంతుల కోసం కాకుంటే మరెందుకోసమో" అనుకునేది వర్ధనం. "బిచ్చగాడు కూడా ఆకలి తీర్చుకునేందుకే గదా వీధి వీధీ తిరిగేది! వాడికి ఆకలేస్తే వీధిన పడి కేకలేసే స్వతంత్రమన్నా వుంది. అంతకన్నా హీనం కాదూ తన బతుకు?" ఇలా సాగేవి వర్ధనం ఆలోచనలు.

ఇద్దరు మగపిల్లల తర్వాత మూడోసారి వర్ధనం కడుపు పండింది. ఇరుగు పొరుగు ఆమెను చూసి "మంచి రంగుదేలావు వర్ధనం. ఈసారి కూతురే పుడద్దిలే" అంటూండటం విన్నాడామె భర్త సుందర రామయ్య. ఒకటికి రెండుసార్లు విన్నాడో లేదో గప్‌చుప్‌గా గవర్నమెంటు ఆసుపత్రికి తీసుకెళ్లి అబార్షన్ చేయించి పిల్లలు కలగకుండా ఆపరేషన్ కూడా చేయించేశాడు. ఆమె నోరెత్తలేదు. కన్నీరు మాత్రం కాలవలై పారింది" రెండుమూడు తరాలుగా ఆడపిల్ల లేని ఇల్లూ ఓ ఇల్లేనా అనుకుని నిట్టూర్చేది గుర్తొస్తే.


* * *

సుందర రామయ్య రెండెకరాల మాగాణిని ఆరెకరాలు చేశాడు. కొబ్బరితోట ఆరెకరాలయింది. ఇంట్లో పాడి గేదెల సంఖ్యా పెరిగింది. అయితే పాలూ పెరుగూ వెన్నా నెయ్యీ, చివరికి మజ్జిగ కూడా అమ్మడానికే. అంతా తనే దగ్గరుండి చూసుకునేవాడు. ఎంత ఉండీ ఏం లాభం- కడుపు నిండా తినే అదృష్టం, ఒంటికి నచ్చిన చీర కట్టుకోలేకపోయాక?

సుందర రామయ్యయితే ఇంట్లో ఎప్పుడూ చీటీగుడ్డతో కుట్టించిన పొడుగు లాగూతోనే ఉండేవాడు... ఏడాదికి రెండు జతలు, బయటికెళ్లేటప్పుడు మాత్రం వేసుకునేవాడు. భార్యకు ఏడాదికి రెండు చేనేత చీరలు, బాగా తక్కువ రకంవి రెండు నైలెక్స్ చీరలూ. ఒకటి దీపావళికి, ఒకటి సంక్రాంతికి. అంతే. ఈలోగా అన్నలెవరైనా పుట్టింటి నుంచీ చీర తెచ్చిస్తే ఒక చీరే తీసుకునేవాడు. ఈ పీనాసితనంతో ఆయన పేరు మరుగున పడిపోయింది. 'పీనాసయ్య' అంటేనే అందరూ గుర్తుపట్టేవారు.

ఎదుగుతున్న పిల్లలకు తండ్రి పీనాసితనం, తల్లి అసహాయత, ఊళ్లో తండ్రంటే అందరికీ ఉన్న చులకన భావం వల్ల నలుగుర్లో తిరగాలన్నా, స్కూలుకెళ్లాలన్నా అవమానకరంగా వుండేది. ఎలాగో గవర్నమెంట్ స్కూల్లో పదవ తరగతి అయిందనిపించారు. ఇంటర్ చదవాలంటే పొరుగూరుకు పోవాల్సిందే. అయితే ఏదన్నా పట్నం హాస్టల్‌లో వుండి చదువుకుంటానని భీష్మించుకున్నాడు శశిధర్. కష్టపడి బాగా చదువుతాననీ డాక్టరు చదువుతో మంచి సంపాదనుంటుందనీ తల్లి దగ్గర పోరి పోరి తండ్రికి చెప్పించి ఒప్పించాడు. కట్నం కూడా బాగా వస్తుందనే దూరాలోచనతోనో ఏమో సుందర రామయ్య ఒప్పుకున్నాడు.

చెప్పినట్టుగానే కష్టపడి చదివాడు. నాలుగు జతల నూలుబట్టలతో, తండ్రి పంపిన డబ్బును అతి పొదుపుగా వాడుకుంటూ ట్యూషన్లు చెబుతూ చదువుకున్నాడు. మెడిసిన్‌లో ఫ్రీ సీటొచ్చింది. అటు రవికాంత్ కూడా అన్ననన



సరించి చదువుకు న్నాడు. ఇంజనీరింగ్ అతని లక్ష్యం అయింది.

శశిధర్ మెడిసిన్ నాలుగో సంవత్సరంలో వుండగా సెలవులకని ఇంటి కొచ్చాడు.

ఆ రాత్రి...

వర్ధనమ్మ నిద్రనాపుకొంటూ పక్కమీద అసహ నంగా కదులుతోంది.

"...ఈరోజెలాగైనా రహస్యం బట్టబయలు కావా ల్సిందే. తను, భర్త ఇలా ప్రవర్తించగలడని అనుకోలేదె ప్పుడూ. ఎన్నాళ్లనుంచీ నడుస్తోందో ఈ భాగోతం? అయినా చెట్టంత కొడుకు ఇంట్లో వున్నా బొత్తిగా సిగ్గూ శరం లేకుండా ఏం పనులివి?"

సుందర్రామయ్య గది దగ్గర తలుపు చప్పుడైంది. వర్ధ నమ్మ నిద్ర నటిస్తూ భర్త చర్యల్ని ఓ కంట గమనించసా గింది. గోడ గడియారం మూడుగంటలు కొట్టింది. సుందర రామయ్య పెరటి తలుపు తెరిచాడు. పెరట్లోంచి వీధిలోకెళ్లేందుకు ఒక చెక్క తలుపుంది. కాసేపటికి ఆ తలుపు తెరచిన చప్పుడు వినిపించింది.

నెమ్మదిగా లేచింది వర్ధనమ్మ. వరం డాలో వీధి కిటికీ రెక్క నెమ్మదిగా తీసి చూసింది. భర్త వీధి మలుపు తిరుగు తున్నాడు. చేతిలో ఏదో ఉన్న ట్టుంది. వెన్నెల మసకగా వుంది. వీధంతా నిర్మానుష్యంగా నిశ్శ బ్దంగా వుంది. తిన్నగా వెళ్తే మెయిన్ రోడ్డొస్తుంది. ఆ రోడ్డు దాటితే పూరిళ్లున్నాయి. ఇంతకీ ఎవరింటికెళ్లాలనీ?

అయితే సుందర్రామయ్య రోడ్డు వరకు వెళ్లలేదు. కుడివైపు పునాదులు వేసిన రామ్మూర్తి ఇంటి ముం దాగాడు. ఇంటి ముందు వీధిలో మట్టి, ఇటు కలు గుట్టలుగా పోసి వున్నాయి. రామ్మూర్తి ఓ సన్న కారు రైతు. పూరిల్లు కూలగొట్టించి పెంకుటిల్లు కట్టుకునే ప్రయత్నంలో వున్నాడు.

వర్ధనమ్మ ఉత్కంఠతో వీధి తలుపు చప్పుడు కాకుండా తెరచి, వీధి అరుగు మీదికొచ్చి స్తంభం చాటున నిలబడింది.

సుందర రామయ్య మట్టిగుట్ట దగ్గర వంగాడు. అటూ ఇటూ పరికించి ఇటుకల గుట్టవైపుకి వెళ్లాడు.

క్షణంలో తానూహించినదానికి విరుద్ధంగా భర్త చేస్తున్న పని అర్థమైపోయిందామెకు. బంగిన పల్లి మామిడి అంటు చెట్టు మొదట్లో తెల్లారి లేస్తూనే రాత్రికి రాత్రి ఈ మట్టి కొత్తగా ఎలా వచ్చిందబ్బా అనుకుందామె. భర్తని అడుగుదామనుకుని పనుల్లో పడి మర్చిపోయింది. మంచిపాటి మట్టి వేస్తే త్వరగా కాపు కొస్తుందని నాంచారయ్య వీధిలో భర్తతో అనడం గుర్తొచ్చిందామెకు. ఓ బండి మట్టి తోలించుకుంటే పెరట్లో మరిన్ని మొక్కలూ ఏపుగా పెరిగేవి. కాసిని పైసలు ఖర్చు అనుకుని, ఓ పేదవాడు డబ్బు ఖర్చుపెట్టి ఇల్లు కట్టుకో దానికి తెప్పించుకున్న మట్టిని ఇలా అర్ధరాత్రి దొంగలాగా తెచ్చుకోవ డాన్ని వర్ధనమ్మ విడ్డూరం చూస్తూన్నట్టు నోటిమీద చేయుంచుకుంది అప్రయ త్నంగా. అరుగు దిగబోయిందామె ఏదో ఆలోచనతో. అంతలో ఎవరో కర్ర ఎత్తి మట్టిగుట్ట వెనకనుంచీ రావడం, దెబ్బ మీద దెబ్బ వేయడం రెప్పపాటులో జరిగి పోయింది. భర్త తల పట్టుకుని కుప్పకూలిపోవడం కన్పిం చిందామెకు.

"శశీ..." అని అరుచుకుంటూ ఇంట్లోకి పరుగు పెట్టిందామె. కేక మాత్రం బయటకి రాలేదు. కొడుకు గది తలుపు దబదబా బాదిందామె. శశిధర్ తలుపు తీసి

తల్లిని భయంగా చూస్తూ "ఏంటమ్మా?" అన్నాడు కంగారుగా. అతని నిద్ర కళ్లింకా సరిగా తెరచుకోనేలేదింకా. మాట పడిపోయినదానిలా కొడుకు చేయి పట్టుకుని వీధిలోకి లాక్కుపోయిందామె, చేత్తో రామ్మూర్తి ఇంటివైపు చూపుతూ. క్షణంలో అర్థమయ్యీ కానట్టున్న స్థితిలో శశిధర్ పరిగెత్తాడటు.

అప్పటికి రామ్మూర్తి 'దొంగ'ని గుర్తుపట్టినట్టున్నాడు.

"బాబయ్యా, తమరా బాబయ్యా! ఎంత పన్జరిగిపోనాదయ్యా... రోజూ మట్టివరో కాజేస్తుండారని ఈయేల కాపు కాశానందయ్యా. తవరిలా జేస్తారని అనుకోలేదు బాబయ్యా. ఎంత గోరం జరిగిపోనాది? నేనేటి జేతును బాబూ" అంటూ రాగాలు తీయబోయాడు.

"రామ్మూర్తీ ఊరుకో... అందరూ లేచొస్తారుగానీ ముందు కాస్త సాయం పట్టు" అంటూ అతన్నాపాడు శశిధర్.

ఇద్దరూ సాయం పట్టినా సుందర రామయ్య నడిచేలా లేదు. శశిధర్ తండ్రిని భుజానికెత్తుకున్నాడు. పరిగెత్తుతున్నట్టుగా గబగబా నడిచి చావిట్లో తల్లి మంచమ్మీద పడుకోబెట్టాడు. ఆయాసంతో రొప్పుతూనే చేయాల్సిందేవిటో అంచనా వేసుకున్నాడతను. తల చిట్లడం వల్ల నెత్తురు ధార కట్టింది. శశిధర్ కొక్కానికున్న తండ్రి పంచెను సర్రున చింపి తలకు గట్టిగా కట్టు కట్టాడు. వెంట తెచ్చుకున్న మెడికల్ కిట్‌లోంచి తీసి రక్తం ఆగడానికి ఇంజెక్షనిచ్చాడు. అయోమయంలో ఏమీ పాలుపోని స్థితిలోనే వర్ధనమ్మ పాలు వెచ్చబెట్టి చెంచాతో భర్త నోరు తెరిపించి తాగించే ప్రయత్నంలో పడింది.

రామ్మూర్తి ఇంకా లబోదిబోమంటూ సుందరరామయ్య కాళ్లు పట్టుకుని ఏడుస్తూనే వున్నాడు.

శశిధర్ తన గదిలోకెళ్లి జేబులోంచి తీసి వెయ్యి రూపాయలు తెచ్చి రామ్మూర్తి చేతిలో పెట్టాడు. రామ్మూర్తి అయోమయంగా చూశాడతనికేసి.

"ఎక్కడా చెప్పకు. నీకూ మాకూ అదే మంచిది. దొడ్లో పడ్డారని చెప్తాం. మళ్లీ పోలీసులూ కేసులూ అవీ. నువ్విక వెళ్లిపో" అని బలవంతంగా అతన్ని పంపేశాడు. ఇంతలో కాస్తంత స్పృహలోకొచ్చిన సుందర రామయ్య చూడనే చూశాడది.

"ఆc... అమ్మా... ఏవిట్రా శశిధర్, అతనికేమిస్తున్నావు? ఎందుకూ అన్నేసి డబ్బులిస్తున్నావ్?" బాధతో మూలుగుతూనే వారించాడాయన కొడుకుని.

శశిధర్ తండ్రి మాటల్ని విననట్టే గదిలోకెళ్లి రక్తంతో తడిసిపోయిన బట్టల్ని మార్చుకుంటూనే "అమ్మా, నాన్నని జగ్గన్నపేట తీసుకెళ్దాం. నర్సింహ బండి కడతదంటావా?" అని తల్లిని సంప్రదిస్తూనే మరోవైపు తండ్రి తలకు కట్టిన కట్టు మొత్తం తడిచిపోవడం గమనిస్తున్నాడు.

సుందర రామయ్యకు పూర్తిగా తెలివి వచ్చి కళ్లు తెరిచాడు.

"ఒరేయ్ నాన్నా శశీ... నేనిక బతకన్రా. ఎక్కడికీ వద్దు. విను, అనవసర ఖర్చులు" ముక్కుతూ మూలుగుతూనే అతి ప్రయత్నం మీద అన్నాడాయన.

శశిధర్‌కు కోపం బుస్సున పొంగింది.

"ఏవిటి నాన్నా... ఈ టైంలో కూడా ఖర్చులూ అవీ చూస్తారా ఆ... పీనాసితనమేగా ఇంతదాకా తెచ్చింది. ఎవరు కక్కుర్తి పడమన్నారు చెప్పండి? ఇంత వయసొచ్చీ ఈ స్థితిలో కూడా, ఛ..." తల విదిలించాడు శశి నిస్సహాయంగా. సుందర రామయ్యకు అంత బలహీనతలోనూ ఎలా వచ్చిందో ఓపిక...

"అవున్రా... నేను పీనాసినే, కక్కుర్తిపడ్డాను. నిజమే. బండి మీద తీసుకెళ్తే దారిలో పోయాననుకో, అంత పైకమూ వృథా..." ఆయన చెబుతూనే వున్నాడు.

"ఎవరికీ చెప్పొద్దు. తమ్ముడొచ్చేదాకా వుంచొద్దు. తద్దినాలనీ ఎక్కువ ఖర్చు చెయ్యొద్దు..." లేవని చేతుల్ని బలవంతంగా లేపి జోడించబోయాడు. చేతులు అచేతనం అయి కిందికి జారిపోయాయి. ప్రాణం పోయింది.

శశిధర్ నిస్సహాయంగా తల పట్టుకున్నాడు. విషయం అర్థమై వర్ధనమ్మ బోరున ఏడవబోయింది. శశిధర్‌కు కర్తవ్యం గుర్తొచ్చింది. తల్లిని సమీపించాడు.

"అమ్మా... నేనుండీ ఏవీ చేయలేకపోయాను, క్షమించు. ఏడవకు. తెల్లారనీ... తమ్ముడున్నా బాగుండేది..." అంటూ నిశ్శబ్దంగా తల్లిని దగ్గరకు తీసుకుని ఓదార్పుగా వీపు నిమురుతూండిపోయాడు.

మరికాసేపటికే దగ్గరున్న మసీదులో ప్రార్థన కోసం 'అజా' మొదలైంది.

* * *

శశిధర్ బాధని ఓర్చుకుంటూ కొద్దిమంది సహాయంతో తండ్రి శవాన్ని కాటికి చేర్చాడు. స్నానం వగైరా అయ్యాక దగ్గరి చుట్టాలకీ, తమ్ముడికీ ఫోన్లు చేశాడు. మర్నాటి



## సోనమ్ సంబరం

అనిల్ కపూర్ కూతురు సోనమ్ కపూర్ నటించగా రిలీజైన రెండు సినిమాలు సావరియా, ఢిల్లీ-6 ఆమెకి చెప్పుకోదగిన సక్సెస్‌ని ఇవ్వలేకపోయాయి. అయితే ఆమె మాత్రం తన కొత్త గ్లామర్‌తో అందరి దృష్టిలోకీ వచ్చేందుకు కృషి చేస్తున్న సంగతి దర్శకుడు సంజయ్ లీలా బన్సాలీ కూడా గమనించినట్టున్నాడు. అందుకనే కాబోలు- 'నువ్వు అజంతా శిల్పంలా వున్నావు. ఇదే పర్సనాలిటీ మెయిన్‌టెయిన్ చేయి' అని ఈమధ్య పొగిడాట్ట. దాంతో సోనమ్ కపూర్ బోల్డు సంబరపడిపోతూ అందరికీ ఇదే మాట చెప్పుకుంటోందిట.

కంతా వచ్చి చేరారు. అంతా అలా ఎలా కానిచ్చావని అడిగేవారే. రవికాంత్ అయితే తనొచ్చేవరకు వుంచలేదనీ, చివరి చూపైనా దక్కకుండా ఎలా చేశావనీ, కనీసం పక్క ఊరికైనా తీసుకెళ్లి వైద్యం చేయించలేకపోయావా అంటూ చుట్టాల ముందే అన్న మీద కోపంతో తాడెత్తున ఎగిరాడు.

తమ్ముడిని ఓదార్పుగా లోపలి గదిలోకి తీసుకుపోయి తల్లి ముందే జరిగిందంతా వివరించి చెప్పి శశిధర్ అతని కోపాన్ని చల్లార్చాడు.

★ ★ ★

అన్నదమ్ములిద్దరూ అన్ని కర్మకాండలూ ముగిసి చుట్టాలంతా ఎవరి దారిన వారెళ్లిపోయాక తండ్రి గదిలో బీరువా, భోషాణం పెట్టె తెరిచారు తల్లి సమక్షంలో. ఎందులో ఏమున్నాయో ఆమెకేమీ తెలియదు. పెళ్లినాడు వర్ధనమ్మకు పెట్టిన నగలు, ఆమె అత్తగారు నగలు, పట్టుచీరలూ పెట్టినవి పెట్టినట్టే వున్నాయి. పెళ్లినాడు ఆ తర్వాత ఒకటి రెండుసార్లు చుట్టాల పెళ్లిళ్లకి పెట్టుకోమని ఇస్తే పెట్టుకుందామె. ఇప్పుడు కొడుకులు పెట్టుకోమని తీసి ఇస్తూంటే ఆమె మనసు మూగబోయింది. వాళ్లని నొప్పించలేక బలవంతంగా చంద్రహారం, గాజులు మాత్రం వేసుకుంది. పొలాలు, కొబ్బరితోటలు, ఇంటి తాలూకు దస్తావేజులతో బాటు కట్టిన పన్నుల రసీదులు, తమకు చదువుకోడానికి పంపిన మనీ ఆర్డర్లు, రసీదులు కూడా ఎంతో జాగ్రత్తగా అట్టేపెట్టడం చూసి అన్నదమ్ములిద్దరూ విచిత్రంగా చూశారు తల్లి వైపు.

ఏ చెట్టు ఏపుగా పెరగాలనీ, బాగా కాపు కాయాలని అప్పనంగా మట్టి తెచ్చి కక్కుర్తి పడి, తన పరువునీ ప్రాణాల్నీ పణంగా పెట్టాడో ఆ బంగినపల్లి మామిడి చెట్టు ఏ కారణం లేకుండా మొత్తం ఎండి మోడైపోయింది, సుందర రామయ్య పోయిన ఆరునెలలకే. వర్ధనమ్మ ఆ చెట్టు మోడును నరకనీయలేదు. భర్త పేరాశని ప్రతిక్షణం గుర్తుచేస్తూ తననీ తన కొడుకుల్నీ మానసికంగా హెచ్చరించేలా దాన్ని అలాగే ఉంచేయమంది. చుట్టూ చిన్న సిమెంటు చప్టా వేయించి, మోడుకు జేగురు రంగు వేయించి ఎలక్ట్రిక్ బల్బులు వేలాడదీయించింది. దాంతో పెరడంతా ఎంతో కాంతివంతంగా, ఎంతో అందంగా తయారయింది. ఇంట్లో కూడా తనకి అనుకూలంగా తగిన మార్పులూ చేర్పులూ దగ్గరుండి చేయించింది. మరీ ముఖ్యంగా తనకు బియ్యం, పప్పులూ కొలిచి ఇచ్చాక తాళం పడే ఆ గదిని పూజగదిగా మార్పించుకుంది.

అంతేకాదు, కొడుకులిద్దర్నీ దగ్గర కూర్చోబెట్టుకుని హితబోధలు చేసింది. తండ్రిలాగా కడుపు కట్టుకుని, కోరికల్ని చంపుకునీ బతకడంలో అర్థం ఆనందం రెండూ లేవని, న్యాయంగా సంపాదించి తాము బతుకుతూ నలుగురి కష్టసుఖాలూ చూడమని కొడుకుల్ని కోరింది. కొడుకులిద్దరూ తల్లి మాటని వేదవాక్కుగా భావించారు.

ఇద్దరూ చదువులు ముగించి, మంచి విద్యావంతులైన భార్యల్ని కట్నం కోరుకోకుండా పెళ్లాడి, మంచి ఉద్యోగాల్లో జీవితాల్లో స్థిరపడ్డారు. తమకు కలిగినదాంట్లోంచి ఎంతో కొంత అవసరమున్నవారికిచ్చి ఆదుకోడంలోని తృప్తిని గ్రహించారు.

ఇన్నేళ్లకు శశిధర్ తానూ భార్యా ఐదారేళ్లుగా అమెరికాలో వుండి సంపాదించింది ఖర్చుపెట్టి, ఊళ్లోనే తమ ఇంటి పక్కనే హాస్పిటల్ తెరవడానికి, అలా ఊళ్లోని పేదలకు ఉచితంగా వైద్య సేవలందించాలని అమెరికాను శాశ్వతంగా వదిలేసి భార్య, ఒక్కగానొక్క కూతురుతో వస్తున్నాడు. రవికాంత్ భార్యాపిల్లలతో కలిసి విజయవాడ నుంచి వస్తున్నాడు. కొన్ని రోజులు అందరూ కలిసి ఆనందంగా గడపాలని వారి అభిలాష.

★ ★ ★


“వాటీజ్డిస్ మాంబా... టెల్మీ... వాట్స్ దిస్ మాంబా...”

మామ్మ చంకనెక్కి పెరట్లో మోడును వింతగా చూస్తూ అడుగుతున్న మనవరాలు ‘ఏలీ’ ఎర్రెర్రటి బుగ్గల్ని పుణికి ముద్దాడుతూ కోడలు అనుపమతో అందామె తెలుగులో.

“నువ్వు చెప్పమ్మా అనుపమా ఈ ఇంగ్లీషు పిల్లకి... వాళ్ల తాతయ్య ఈ చెట్టంటే ప్రాణం పెట్టేవారనీ, ఆయన పోయాక అదీ ఎండిపోయిందనీ ఇంగ్లీషులో చెప్పు తల్లీ. ఆయన గారి జ్ఞాపకార్థం అదలా తరతరాలకీ ఉండిపోవాలి...” చివరి మాటలు స్వగతంగా అనుకున్నట్టు ఆమె గొంతు వణికింది.

నిజానికిదెంత చేదు జ్ఞాపకమో!

○



## తప్పదు మరి

బాలీవుడ్ హాట్ స్టార్ మల్లికా షెరావత్‌కి జనాల్లో మంచి క్రేజే వుంది కదా! అయితే ఏదైనా షాపింగ్‌కి వెళ్లాలంటే మల్లికకు ముంబయ్ వీధుల్లో అభిమానుల వల్ల చాలా ఇబ్బందికరంగా వుంటుందిట. దాంతో ఈమధ్య ఎక్కడికెళ్లినా బురఖా ధరించి షాపింగ్‌లకూ గ్రాలకూ వెళ్తోందిట. ఈ సంగతి ఆ నోటా ఈ నోటా అలా బయటికొచ్చేసరికి ఓసారి పబ్లిక్ ప్లేసులో నలుగురి దృష్టికీ వచ్చేసిందిట. ‘మరేం చేస్తాను చెప్పండి- బజార్లో కాస్త స్వేచ్ఛగా తిరగాలంటే ఇలా తప్పడం లేదు’ అని దీర్ఘాలు తీసింది.